సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 16 ఏప్రిల్ । 2024



క్రమబద్ధీకరణపై కనికరమేది?
ప్రభుత్వ వైద్యారోగ్య విభాగం నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో సేవలందిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
- 8లో▸



పోలీస్‌స్టేషన్‌లో ఆటాపాట - 8లో▸
ఓ సినిమా పాటకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే స్టెప్పులేశాడు. ఈఘటన భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ పీఎస్‌లో చోటు చేసుకుంది.

గరిష్టం/కనిష్టం
42.7^0 /21.6^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రికి వస్తువుల బహూకరణ



గూడూరు: మండలంలోని తీగలవేణి పీహెచ్‌సీ అభివృద్ధికి మిడ్‌వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.10 లక్షల విలువైన వస్తువులను అందించినట్లు వైద్యుడు వి.రాంబాబు, యునాని వైద్యుడు కె.కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆసంస్థ ప్రతినిధులు ఆస్పత్రికి ఆర్వో వాటర్ ప్లాంట్, రెండు బ్లూస్టార్ ఏసీలు, నాలుగు బీరువాలు, ఈసీజీ మిషన్, ల్యాప్‌టాప్, ట్యాబ్ అండ్ ప్రింటర్, నాలుగు టేబుళ్లు, మూడు సెతస్కోప్‌లు, ఇన్వర్టర్, సర్జికల్ పరికరాలు అందజేశారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో మినీ మీటింగ్‌హాల్ నిర్మాణం చేయనున్నట్లు ఆ సంస్థ మేనేజర్ వినయోందర్ రెడ్డి, అకౌంట్స్ మేనేజర్ మల్లయ్య, రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి నర్సింగ్ ఆఫీసర్ ఉదయశ్రీ, సురేష్, రమేష్, ఫార్మసిస్టు అమల పాల్గొన్నారు.

నేడు 'స్వీప్'రన్

మహబూబాబాద్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి స్వీప్ రన్ నిర్వహించనున్నట్లు స్వీప్ నోడల్ అధికారి మరియన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాలతో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు తెలిపేందుకు స్వీప్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటలకు రన్ ప్రారంభమవుతుందని, జిల్లాలోని ఓటర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రాజెక్ట్ పనుల పరిశీలన



డోర్నకల్: మండలంలోని కన్నెగుండ్ల గ్రామ సమీపంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను సోమవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ప్రాజెక్ట్ కాల్వ పనుల ప్రదేశంలో యూటీ నిర్మాణ పనులను ఇరిగేషన్‌శాఖ క్వాలిటీ కంట్రోల్ ఈఈ రమణ, డీఈ చంద్రమోహన్, ఏఈ మహేష్, కన్‌స్ట్రక్షన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. కాగా ప్రాజెక్ట్ కాల్వ నిర్మాణం పక్కనే వెన్నారం చెరువు ఉండటంతో కాల్వ కిందినుంచి వరదనీరు చెరువులోకి వెళ్లేందుకు జరుగుతున్న యూటీ నిర్మాణ పనులను పరిశీలించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత?

● డీసీఎం స్వాధీనం

కురవి: మండల కేంద్రం శివారు పెద్ద చెరువు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కురవి పోలీసులు పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. బయ్యారం మండల కేంద్రం వైపు నుంచి కురవి మీదుగా మరిపెడ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను కురవి పోలీసులు తనిఖీ చేశారు. దానిలో అక్రమంగా తరలిస్తున్న 120 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడినట్లు తెలిసింది. బియ్యం డీసీఎం వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తుల ఆచూకీ కోసం విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ బియ్యం మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిసింది. బియ్యం రవాణా వెనుక ఎవరు ఉన్నారనే విషయంపై విచారణ చేస్తున్నారు. రెండు రోజుల్లో అరెస్టు చూపే అవకాశం ఉందని సమాచారం.

అప్రమత్తంగా ఉండాలి

● ఎస్‌ఎఫ్‌ఓ నాగేశ్వర్‌రావు



మహబూబాబాద్: అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆశాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, రైల్వేస్టేషన్ ఎదుట, ఇతర ప్రాంతాల్లో సిబ్బంది పలు విన్యాసాలను ప్రదర్శించి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల్లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముందుగా పలు జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలు జరగవన్నారు. కేవలం నిర్లక్ష్యంవల్లే అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చేతుల మీదుగా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, రవీందర్, ప్రసన్నకుమార్, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిధులు వాపస్

జిల్లా అభివృద్ధికి మాజీ సీఎం రూ.181.97కోట్లు మంజూరు

- పనుల్లో ఆలస్యం.. ప్రారంభం కాని పనులు 1,327
- కొత్త పనులు ప్రారంభించొద్దని నూతన ప్రభుత్వం ఆదేశాలు
- రూ.112.57కోట్లు వెనక్కి వెళ్లిన వైనం



సాక్షి, మహబూబాబాద్: జిల్లాకు గత ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసిన అభివృద్ధి నిధులు వెనక్కి వెళ్లాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ జిల్లాలో పర్యటించి భారీగా నిధులు మంజూరు చేశారు. అయితే నాయకుల మధ్య గొడవలతో సకాలంలో పనులు ప్రారంభించలేదు. ఈ క్రమంలో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. దీంతో పాత సర్కారు హయాంలో ప్రారంభించిన పనులకు మాత్రమే బిల్లులు వస్తాయని, ప్రారంభించని పనులను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు జిల్లాకు మంజూరైన రూ.112.57కోట్లు వెనక్కి వెళ్లాయి.

జిల్లా అభివృద్ధికి రూ.181.97కోట్లు

గతేడాది జనవరి 12వ తేదీన కలెక్టరేట్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన జిల్లాపై వరాల జల్లులు కురిపించారు. జిల్లా కేంద్రం మానుకోటకు రూ.50కోట్లు, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ మున్సిపాలిటీలకు రూ. 25కోట్ల చొప్పున, అదే విధంగా జిల్లాలోని 461 గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున ముఖ్యమంత్రి ప్రత్యేక అభివృద్ధి నిధులను ఇస్తున్నట్లు ప్రకటించారు. పది రోజుల్లో జీఓ కూడా విడుదల చేశారు. మొత్తం రూ.181.97కోట్ల పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

పనులు ఇలా..

జిల్లాలోని తొర్రూరు మున్సిపాలిటీకి కేటాయించిన రూ.25కోట్లతో ఇంటర్నల్ పైపులైన్లు, డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాంతంలో రోడ్లు, క్రీడా మైదానం అభివృద్ధి, ట్యాంక్ బండ్, పార్కు అభివృద్ధి, పట్టణంలోని జంక్షన్ల సుందరీకరణ, లైటింగ్, వర్షపు నీరు వెళ్లేందుకు డ్రెయినేజీ పనులు చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా మరిపెడ మున్సిపాలిటీలో రూ.25కోట్లతో ట్యాంక్ బండ్, అంతర్గత రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, ఇతర పనులు చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేశారు. డోర్నకల్ మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ట్యాంక్ బండ్ నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లకు ప్రహరీలు, ఎనిమల్ కేర్ సెంటర్ నిర్మాణం, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ఆటోలు, జేసీబీ, ట్రాక్టర్ల కొనుగోలు, సుందరీకరణ పనుల కోసం రూ.25కోట్లు కేటాయించారు. అలాగే గ్రామ పంచాయతీలకు కేటాయించిన రూ.10లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, అంతర్గత రోడ్ల నిర్మాణం, పాఠశాలల్లో వసతులు, ఇతర పనులు చేపట్టాలని, మిగిలిన నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేయాలని గ్రామ సభల్లో ఎంపీడీఓల ఆదేశాల మేరకు తీర్మానం చేశారు. అదేవిధంగా మానుకోటకు ఇచ్చిన రూ.50కోట్లలో ఒక్కో వార్డుకు రూ.50లక్షల చొప్పున 36 వార్డుల్లో వసతుల కోసం రూ.18కోట్లు కేటాయించాలని.. మిగిలిన రూ.32కోట్లతో పట్టణాభివృద్ధి, పార్కులు, సుందరీకరణ పనులకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మొత్తం 2,074 పనులు సత్వరమే ప్రారంభించాలని అప్పటి కలెక్టర్ శశాంక ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు.

పనుల్లో జాప్యం.. నిధులు వెనక్కి..

జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుల మధ్య సయోధ్య కుదురకపోవడం, మిగిలిన మున్సిపాలిటీల్లో కమీషన్ల పనులు చేసేందుకు వెనుకాడడం, పలు గ్రామ పంచాయతీల్లో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో సకాలంలో పనులు ప్రారంభించలేదు. మొత్తం రూ.181.97కోట్లతో చేపట్టే 2074 పనుల్లో కేవలం రూ. 57.51 కోట్ల విలువగల 470 పనులు మాత్రమే ప్రారంభించారు. ఇందులో రూ.47.91కోట్ల విలువ చేసే 207పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన రూ.112.57కోట్ల విలువచేసే 1,327 పనులు ప్రారంభించలేదు. అయితే తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వంలో మొదలుపెట్టని పనులు ప్రారంభించొద్దని నూతన సర్కారు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాకు వచ్చిన రూ.112.57కోట్లు వెనక్కి వెళ్లాయి. సకాలంలో పనులు ప్రారంభించి ఉంటే ఆ నిధులు వెనక్కి వెళ్లేవికావని అధికారులు చెబుతున్నారు.

సమయపాలన.. మాకు వర్తించదు!



మల్యాల ఎంపీయూపీఎస్‌కు వేసిఉన్న తాళం



తాళం తీయకపోవడంతో బయట కూర్చున్న విద్యార్థులు

● మల్యాల ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం

మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులు పాఠశాల సమయానికి హాజరుకాలేదు. దీంతో తాళం వేసి ఉండడంతో విద్యార్థులు ఆరుబయటనే వేచి ఉన్న ఘటన మహబూబాబాద్ మండలం మల్యాల ఎంపీయూపీఎస్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాఠశాలలో 9మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా 44 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 32మంది హాజరయ్యారు. కాగా 9మంది ఉపాధ్యాయుల్లో ముగ్గురు డిప్యుటేషన్‌పై వెళ్లారు. మిగిలిన ఆరుగురిలో హెచ్‌ఎం సెలవులో ఉండగా.. మరొక ఉపాధ్యాయుడు పదవీ విరమణ దగ్గరగా ఉందని సెలవుపెట్టి వెళ్లారు. మిగిలిన నలుగురు ఉపాధ్యాయుల్లో ఒకరు తప్పకుండా ఉదయం 7.45 గంటలకు పాఠశాలకు రావాలని నిబంధన ఉండగా.. 8.30గంటల వరకు ఎవరూ రాలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీరేశం తాను ఉదయం 8.05గంటలకు ఆలస్యంగా వచ్చానని తెలిపారు. మిగిలిన ఉపాధ్యాయుల్లో ఇద్దరు పరీక్ష పేపర్లు తీకురావడంలో కొంత ఆలస్యమైందని, మరో ఉపాధ్యాయురాలు ఆటోలో రావడం వల్ల ఆలస్యమైందని వివరించారు. ఈ విషయమై ఎంఈఓ పూల్‌సింగ్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించని అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు

నెహ్రూసెంటర్/కురవి: వేసవికాలం దృష్ట్యా ప్రజలందరూ జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు కురవి మండలంలోని జి.కొత్తూరు, బలపాల పీహెచ్‌సీలను సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. ఒకవేళ మధ్యాహ్నం బయటకు వెళ్తే రుమాల్, గొడుగు, టోపీ, తాగునీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ లేదా వైద్యులను సంప్రదించాలన్నారు. అసంక్రమిత వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని, 30 సంవత్సరాలు పైబడిన వారందరూ షుగర్, కేన్సర్, ఇతర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణార్జునరావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: జిల్లాలో జూన్‌లో నిర్వహించే గ్రూప్–1 పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ గొప్పో, డేవిడ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖలవారీగా పరీక్షలకు ఏర్పాట్లు చేపట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా తహసీల్దార్లను లేదా సమాన క్యాడర్ జిల్లా అధికారులను నియమించాలన్నారు. ప్రతీ ప్రాంతీయ కేంద్రానికి స్ట్రాంగ్ రూం నిర్వహణ, పరీక్ష మెటీరియల్ రవాణా, పంపిణీ, కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలుకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. పరీక్ష సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. అభ్యర్థులు హాల్‌లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీఓలు అలివేలు, నర్సింహారావు, డీఐఈఓ సత్యనారాయణ, డీఈఓ రామారావు, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి పాల్గొన్నారు.

19న సీఎం రేవంత్‌రెడ్డి రాక

అదేరోజు బలరాంనాయక్ నామినేషన్ దాఖలు

- లక్ష మందితో బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించనున్న వేం నరేందర్‌రెడ్డి



సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి ఈనెల 19న జిల్లా కేంద్రానికి రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీఎం పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా తెలిసింది. ఇందుకోసం మాజీ ఎమ్మెల్యే, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో జిల్లా నాయకులతో సమీక్షించారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మానుకోట ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాంచంద్రునాయక్‌తో సీఎం పర్యటనపై చర్చించారు.

పాలమూరు టు మానుకోట..

ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల శంఖారావం మొదలు పెట్టనున్నారు. అదేరోజు ఉదయం మహబూబ్‌నగర్(పాలమూరు)లో పార్టీ ఎంపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు, బహిరంగ సభను నిర్వహిస్తారు, అనంతరం అక్కడి నుంచి నేరుగా మానుకోటకు రానున్నారు. అప్పటికే ఇక్కడ స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి బలరాంనాయక్ నామిషన్ దాఖలు చేస్తారు. అనంతరం సాయంత్రం 3గంటలకు భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే తొలిరోజు సభను విజయవంతం చేసేలా అందరు కష్టపడాలని వేం నరేందర్‌రెడ్డి చెప్పినట్లు తెలిసింది.

లక్ష మందితో సభ..

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి తొలిరోజు నిర్వహించే బహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పార్లమెంట్ పరిధి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మూడు బహిరంగ సభలు ఉండే అవకాశం ఉన్నట్లు చర్చించారు. అయితే మహబూబాబాద్ సభకు మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి లక్షకు పైగా జనాలను తరలించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా నాయకులకు మంత్రులు సూచించారు. ఇందుకోసం మహబూబాబాద్ పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో వేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

స్వాగతం పలికేదెలా..

జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా నియమితులైన తర్వాత తొలిసారిగా ఈనెల 17న ఇక్కడికి రానున్నారు. అయితే జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితులుగా ఉన్న నరేందర్‌రెడ్డి శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొనడంతోపాటు, 19న జరిగే సీఎం బహిరంగ సభ ఏర్పాట్లు కూడా చూస్తారు. అయితే ఆయన ఎప్పుడు జిల్లాకు వచ్చినా ఘన స్వాగతం పలకాని కాంగ్రెస్ జిల్లా నాయకులు, మిత్రులు సిద్ధంగా ఉన్నారు. కనీసం 500కు తక్కువ కాకుండా కార్ల కాన్వాయ్‌తో జిల్లా సరిహద్దుల్లో స్వాగతం పలకాలని యోచిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందుకు అది సాధ్యం కాదనే చర్చ కూడా జరుగుతోంది. ఏదిఏమైనా వేం నరేందర్‌రెడ్డికి జిల్లా ప్రజలు మాత్రం ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

నెహ్రూసెంటర్: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీకి ఓటమి తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలపై సోమవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.నాగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తామని మోదీ చెబుతున్నా.. మరో పక్క ప్రజల నుంచి వ్యతిరేకతతో ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. మరోసారి అధికారం చేపట్టేందుకు ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలపై దాడులు, అరెస్టులు చేయించి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించేందుకు ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, బానోత్ సీతారాం, సమ్మెట రాజమౌళి, రామ్మూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జైలు నిర్మాణానికి చర్యలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో నూతన జైలు నిర్మాణంపై చర్యలు ప్రారంభమయ్యాయి. జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్ సోమవారం సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశానుసారం ప్రస్తుత మహబూబాబాద్ జైలును విస్తరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నూతన జైలు ఏర్పాటు, అవసరమైన స్థలం, వనరుల సేకరణ గురించి తెలుసుకునేందుకు ఇతర జిల్లాల జైళ్లను పరిశీలించి నివేదిక అందజేయాలని సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు సూచించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్లుగా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, సభ్యులుగా సీనియర్ మహిళా న్యాయమూర్తి, జైలు సూపరింటెండెంట్, మహిళా జైలు సూపరింటెండెంట్ నియామకమయ్యారు.

ముగ్గురికి మెమోలు జారీ

దంతాలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నాసిరకం సెలైన్ బాటిల్ పంపిణీపై ఆదివారం సాక్షి దినపత్రికలో 'స్పష్టత ఏది' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌ఓ కళావతిబాయి స్పందించారు. సోమవారం ఆమె ఆస్పత్రి స్టాఫ్‌నర్సు కవిత, వైద్యురాలు చైతన్య, ఫార్మసిస్ట్ రవీందర్‌కు మెమోలు జారీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్

అథ్లెటిక్స్‌లో ఖాజాకు కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన ఖాజామియాను అభినందిస్తున్న అదనపు కలెక్టర్

నర్సింహులపేట: సికింద్రాబాద్‌లోని రైల్వే స్టేడియంలో ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ఖాజామియా కాంస్య పతకం సాధించాడు. 60ఏళ్ల విభాగంలో 800మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించిన ఆయనను సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్ అభినందించారు. ప్రతి ఒక్కరు వ్యాయామంతో పాటు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.

ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు

మహబూబాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో సోమవారం పోలీసులు, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు ఉపేందర్, శివ, అరుణ, పోలీసు సిబ్బంది గంజాయి రవాణా జరుగుతుందా.. ఎన్నికల గిఫ్ట్ ప్యాకెట్లు ఏమైనా వస్తున్నాయా అని పరిశీలించారు.

మార్కెట్‌కు పోటెత్తిన మక్కలు



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మక్కలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మక్కలు పోటెత్తాయి. ఈ సీజన్‌లోనే అధికంగా 17,881బస్తాల మక్కలు అమ్మకానికి వచ్చాయి. దీంతో మార్కెట్ షెడ్లన్నీ నిండిపోగా, ఓపెన్‌యార్డులో రైతులు రాశులుగా పోసుకున్నారు. టెండర్లు ఆసల్యం కావడంతో కాంటాలు సాయంత్రం ప్రారంభించారు. దీంతో రాత్రి వరకు సగం మేరకే తొలకాలు జరిగాయి. రైతులు రాత్రంతా మక్కల రాశుల వద్దే పడిగాపులుపడ్డారు. కాగా మక్కలు క్వింటాకు గరిష్ట ధర రూ.2,163, కనిష్ట ధర రూ.1,951 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

ఉచిత శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్–1,2, 3, 4లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ ఏఎస్‌డబ్ల్యూఓ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఎస్సీ నిరుద్యోగులు, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మూడు నెలలు ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్, ఆధార్, రేషన్ కార్డులతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 944012620, 9849943887 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో మేకల కాపరి మృతి


కృష్ణమూర్తి (ఫైల్‌)

దంతాలపల్లి : వడదెబ్బతో మేకల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. దంతాలపల్లికి చెందిన కన్నెబోయిన కృష్ణమూర్తి (60) వృత్తిరీత్యా మేకలు పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న మేకలతో పాటు మరికొన్నింటిని కూలీకి కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో మేకలు మేపడానికి వెళ్లాడు. ఎండ తీవ్రంగా ఉండడంతో దాహం వేయగా నీరు కోసం అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ నీరు లభించలేదు. దీంతో అక్కడే ఓ చెట్టు కింది వెళ్లి పడిపోయాడు. మేకలు తన పొలంలో మేయడం గమనించిన రైతు సోమయ్య ఘటనాస్థలికి వెళ్లి చూడగా కృష్ణమూర్తి మృతి చెంది కనిపించాడు. దీంతో సోమయ్య వెంటనే గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు విషయం తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..


లక్ష్మి (ఫైల్‌)

టేకుమట్ల: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ మహిళ.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి టేకుమట్ల మండలం ద్వారకపేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావటి లక్ష్మి(35) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయంలో తరుచూ మనస్తాపానికి గురవుతోంది. ఈ క్రమంలో ఈ నెల 12న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు చిట్యాల సివిల్‌ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌ ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి లక్కం శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై అమరేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

ఫోర్జరీ కేసు.. ముగ్గురి అరెస్ట్‌

కమలాపూర్‌: నకిలీ ఇంటి యాజమాన్య ధ్రువీకరణ పత్రం సృష్టించి పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్‌ చేసినట్లు కమలాపూర్‌ సీఐ ఈ.హరికృష్ణ సోమవారం తెలిపారు. సుమారు రెండు నెలల క్రితం కమలాపూర్‌ మండలం శనిగరం గ్రామానికి చెందిన బండి పరమేశ్వర్‌, బత్తినివానిపల్లికి చెందిన సంగ నవీన్‌, ఐనవోలుకు చెందిన గూడ రాజేష్‌.. శనిగరం గ్రామానికి చెందిన ఒక ఇంటి యాజమాన్య నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించారు. ఆర్థికంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో సదరు ధ్రువీకరణ పత్రంపై పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రవళిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం ముగ్గురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

క్రమబద్ధీకరణపై కనికరమేది?

- ఎన్‌హెచ్‌ఎంలో ఏళ్లుగా పని చేస్తున్నా రెగ్యులరైజ్‌ కాని ఉద్యోగుల సర్వీస్‌
- ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 502 మంది ఎంప్లాయీస్‌
- అన్ని కేడర్లకు 510 జీఓను వర్తింపజేయాలని డిమాండ్‌

గీసుకొండ: ప్రభుత్వ వైద్యారోగ్య విభాగం నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ (ఎన్‌హెచ్‌ఎం) స్కీమ్‌లో సేవలు అందజేస్తున్న ఉద్యోగులు సర్వీస్‌ పర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా పర్మినెంట్‌ కావడం లేదు. నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వీరు అందించే వైద్య సేవలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రాత్రింబవళ్లు వీరి సేవలను వినియోగించుకుంటున్న ప్రభుత్వం.. క్రమబద్ధీకరణ చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదు. ఈ పథకంలో 24 సంవత్సరాల నుంచి విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వం రెగ్యులరైజ్‌ చేయకపోవడంతో కొందరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా సర్వీస్‌ రెగ్యులరైజ్‌ అంశంపై తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారిని మరో సమస్య వెంటాడుతోంది. గత నెల(మార్చి) జీతం అందకపోగా ఏడు నెలల పీఆర్సీ, ఎరియర్స్‌ను చెల్లించాల్సి ఉంది.

ఎన్‌హెచ్‌ఎంలో 502 మంది ఉద్యోగులు..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో సుమారు 502 మంది హెల్త్‌ మిషన్‌ స్కీమ్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. అర్బన్‌ హెల్త్‌ సెంటర్లలో పీహెచ్‌ఎం అకౌంటెంట్లు, సపోర్టింగ్‌ స్టాఫ్‌, మెడికల్‌ అసిస్టెంట్లు, ఎంఎన్‌ఓ,వాచ్‌మెన్‌, స్వీపర్‌, బస్తీదవాఖానాలోని సపోర్టింగ్‌ స్టాఫ్‌, బ్లడ్‌ బ్యాంకు డీఈఓ, ల్యాబ్‌ అటెండర్‌, ఎస్‌ఎన్‌సీయూ డీఈఓ సెక్యూరిటీ గార్డులు, ఓటీ టెక్నీషియన్‌, టీ–హబ్‌ డీఈఓ, సపోర్టింగ్‌ స్టాఫ్‌, పీహెచ్‌సీ డీఈఓ కాంటిజెంట్‌ వర్కర్లు, డిస్ట్రిక్ట్‌ ఎర్లీ ఇంటర్వెన్షన్‌ సెంటర్‌లో డెంటల్‌ టెక్నీషియన్‌, సోషల్‌ వర్కర్‌, ఎంసీహెచ్‌ఓటీ అసిస్టెంట్‌, సెక్యూరిటీ గార్డు, సపోర్టింగ్‌ స్టాఫ్‌, ఆయుష్‌ ఎస్‌ఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓ, ఎంసీహెచ్‌ సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్లు, ఎస్‌టీఎల్‌ఎస్‌ టీబీ లెప్రసీ వింగ్‌ సూపర్‌వైజర్లతో పాటు పలు కేటగిరీలకు చెందిన వారు హెల్త్‌ మిషన్‌ స్కీమ్‌లో సేవలు అందిస్తున్నారు.


సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు(ఫైల్‌)

సమస్యలు పరిష్కరించాలి



ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో ఔట్‌ సోర్సింగ్‌, కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న వారి సర్వీస్‌ను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్‌ చేయాలి. 510 జీఓను అన్ని కేడర్లకు వర్తింపజేసి న్యాయం చేయాలి.

– రామ రాజేశ్‌ఖన్నా, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉద్యోగుల ప్రధాన సమస్యలు

- ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో పని చేస్తున్న అన్ని కేడర్ల వారి సర్వీస్‌లు రెగ్యులర్‌ చేయాలి.
- నెలనెలా సకాలంలో వేతనాలు చెల్లించాలి.
- గత బీఆర్‌ఎస్‌ సర్కారు జారీ చేసిన 510 జీఓ ద్వారా కొన్ని కేడర్ల వారికే మేలు జరిగింది. అన్ని కేడర్ల వారికి వర్తించకపోవడంతో సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మందికి అన్యాయం జరిగింది. ఈ జీఓను అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలి.
- సమాన పనికి సమాన వేతనం కింద రెగ్యులర్‌ ఉద్యోగుల తరహాలో జీతభత్యాలు(బేసిక్‌పే) చెల్లించాలి.
- మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- కేంద్రం నుంచి 60, రాష్ట్రం నుంచి 40 శాతం నిధులు ప్రతీ నాలుగు నెలలకు మంజూరు కావాల్సి ఉంది. అయితే నిధుల మంజూరు సరిగా లేకపోవడంతో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీతభత్యాలు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- హైదరాబాద్‌ దుండిగల్‌లో ఘటన..
- మృతుడు ఎన్పీడీసీఎల్‌ మాజీ సీఎండీ గోపాల్‌ రావు మనవడు

హన్మకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని దుండిగల్‌ సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్‌ అన్నమనేని అనిల్‌ చందర్‌ రావు ఏకైక కుమారుడు మేఘాంశ్‌(21) హైదరాబాద్‌ టెక్‌ మహేంద్ర వర్సిటీలో బీటెక్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా దుండిగల్‌ సమీపంలోని ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డు దగ్గర అతివేగంగా వెళ్తూ పూలే విగ్రహాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మేఘాంశ్‌ అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు స్నేహితులకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మేఘాంశ్‌ మృతదేహాన్ని సోమవారం హనుమకొండ విద్యుత్‌ నగర్‌లోని స్వగృహానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడు టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్‌ రావుకు మనవడు. మాజీ మేయర్‌, బీజేపీ సీనియర్‌ నాయకుడు డాక్టర్‌ టి.రాజేశ్వర్‌ రావు, టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి, ఇన్‌చార్జ్‌ డైరెక్టర్లు బి.అశోక్‌ కుమార్‌, సదర్‌లాల్‌, వి.మోహన్‌ రావు, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు, జీఎంలు.. మాజీ సీఎండీ అన్నమనేని గోపాల్‌ రావు, కుంటబ సభ్యులను పరామర్శించారు.


మేఘాంశ్‌ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


మేఘాంశ్‌ (ఫైల్‌)

మేఘాంశ్‌కు ఎమ్మెల్యే నాగరాజు నివాళి

మేఘాంశ్‌ మృతదేహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్‌.నాగరాజు సోమవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్‌ కుందూరు వెంకటరెడ్డి, అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌ రావు, టీపీసీసీ మాజీ జనరల్‌ సెక్రటరీ మార్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు


చికిత్స పొందుతున్న శాంతమ్మ

వెంకటాపురం(కె): మండలంలోని ముకునూరు పాలెం గ్రామ సమీపంలో ఓ ఉపాధి హామీ కూలీ పాముకాటుకు గురైంది. గ్రామానికి చెందిన మీడియం శాంతమ్మ సోమవారం ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో పాముకాటుకు గురైంది. గమనించిన గ్రామస్తులు పామును చంపి మహిళతో పాటు వెంకటాపురం వైద్యశాలకు తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు శాంతమ్మకు చికిత్స నిర్వహించారు. గ్రామస్తులు సకాలంలో శాంతమ్మను ఆసుపత్రికి తరలించగా ఆమెకు ప్రాణాపాయం తప్పింది.

పసికందు మృతదేహం లభ్యం

ఎల్కతుర్తి: మండలంలోని గోపాల్‌పూర్‌ చెరువులో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. జన్మించిన మూడు, నాలుగు రోజులకే ఓ పసికందును (బాలుడు) చెరువులో పడేశారు. సోమవారం ఆ చిన్నారి మృతదేహం తేలగా.. ఈ ఘటన చూసిన స్థానికులు తీవ్రంగా కలతచెందారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌ చెరువులో ఓ పసికందు మృతదేహం తేలియాడింది. దీనిని గమనించిన స్థానికులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ ప్రవీణ్‌కుమార్‌, ఎస్సై రాజ్‌కుమార్‌ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చిన్నారి గురించి గ్రామంలో ఆరా తీసినా వివరాలు తెలియలేదు. బాలుడు జన్మించిన తర్వాత మృతి చెందితే చెరువులో పడేశారా..? లేదా ప్రాణం ఉండగానే చెరువులో పడేశారా? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌ ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్‌ తెలిపారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

- సైబర్‌ క్రైం ఏసీపీ విజయ్‌ కుమార్‌


మాట్లాడుతున్న సైబర్‌ క్రైం ఏసీపీ విజయ్‌ కుమార్‌

హన్మకొండ: బాలలు ఆన్‌లైన్‌లో లైంగికదాడులకు గురికాకుండా ఉండడానికి తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని సైబర్‌ క్రైం ఏసీపీ విజయ్‌ కుమార్‌ అన్నారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని 'అసుంత' భవన్‌లో ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్‌ ఆఫ్‌ ఇండియా ఫౌండేషన్‌ సహకారంతో 'ఆన్‌లైన్‌ వేధింపుల నుంచి బాలల సంరక్షణ–తల్లిదండ్రుల పాత్ర' అనే అంశంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏసీపీ విజయ్‌ కుమార్‌ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో తెలిసిన (పరిచయస్తులు) వారు మాత్రమే ఎక్కువ బాలలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంలో పిల్లలు అప్రమత్తంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ ఆన్‌లైన్‌లో వారు చేస్తున్న కార్యకలాపాలను తరచూ గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలు ఏదైనా వేధింపులకు గురైనట్లు అనిపిస్తే శిక్షించకుండా వారిని సంరక్షించాలన్నారు. అంతేకాకుండా ప్రస్తుత సమాజంలో వయసుతో సంబంధం లేకుండా పురుషులు, మహిళలు సైబర్‌ క్రైమ్‌ ద్వారా ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇలాంటి ఘటనలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ముఖ్య రిసోర్స్‌ పర్సన్‌, మైచాయిసెస్‌ ఫౌండేషన్‌ రాష్ట్ర కోఆర్డినేటర్‌ జున్ను క్రాంతి.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులకు మానవక్రమ రవాణా రూపాలు, బాలలు ఆన్‌లైన్‌లో ఏ విధంగా వేధింపులకు గురవుతున్నారు.. వారిని ఏ విధంగా సంరక్షించాలనే అంశాలను పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సైబర్‌ క్రైమ్‌ కానిస్టేబుల్‌ బి.కిశోర్‌ కుమార్‌, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్‌ బత్తుల కరుణ, ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ ఎర్ర శ్రీకాంత్‌, చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ సభ్యులు పరికి సుధాకర్‌, సింగారపు భాస్కర్‌, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఫీల్డ్‌ కోఆర్డినేటర్‌ ఇసంపల్లి సుదర్శన్‌, ఆఫీస్‌ మేనేజర్‌ అజయ్‌ కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి పట్టిన పీడ 'కడియం'

- వెన్నుపోటు, బ్లాక్‌మెయిల్‌ రాజకీయాలకు కేరాఫ్‌ ఆయనే..
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ రాజయ్య ఘాటు వ్యాఖ్యలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్‌: ఘన్‌పూర్‌ నియోజకవర్గానికి పట్టిన పీడ కడియం శ్రీహరి అని, వెన్నుపోటు, బ్లాక్‌మెయిల్‌ రాజకీయాలకు కేరాఫ్‌ అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్‌ కేంద్రంలోని అంబేడ్కర్‌ సెంటర్‌ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ద్రోహి అని, అధికార దాహంతో ఉద్యమ నేత, బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన కడియంను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. మొదట ఎన్టీఆర్‌ హయాంలో టీడీపీలో చేరి మంత్రి పదవులు అనుభవించి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు పంచన చేరాడని, అనంతరం పలు మంత్రిత్వ శాఖలు చేసి బాబును మోసం చేసి కేసీఆర్‌ పంచన చేరాడన్నారు. మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్‌ ఇవ్వకుండా కాంగ్రెస్‌ పార్టీ మాదిగలను దగా చేసిందన్నారు. ఇప్పటికే కావ్య కులంపై, మతాంతర వివాహంపై రచ్చ జరుగుతుందని, నైతికంగా ఓడిపోయిందని, ప్రజల్లో మూడో స్థానంలో ఉందన్నారు. నియోజవకర్గంలో బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని, బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌, నాయకులు చల్లా చందర్‌రెడ్డి, ఆకుల కుమార్‌, అక్కినపెల్లి బాలరాజు, తాటికొండ సురేష్‌కుమార్‌, కనకం గణేష్‌, మహేందర్‌రెడ్డి, పొన్నం రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- రూ. 5వేల జరిమానా


వరంగల్‌ లీగల్‌/మడికొండ: పాతకక్షల నేపథ్యంలో ఒకరిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఎం.సత్యనారాయణగౌడ్‌, మడికొండ పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట మండల రాంపేట గ్రామానికి చెందిన దాడబోయిన శంకరయ్యకు తన చిన్నాన్న కుటుంబంతో భూ సంబంధ వివాదం ఉంది. ఈ వివాదంలో గ్రామపెద్ద మనిషిగా వ్యవహరించే అలువల సమ్మయ్య ప్రత్యర్థులతో కలిసి తనకు అన్యాయం చేశాడని శంకరయ్య ద్వేషం పెంచుకున్నాడు. అలాగే, గ్రామంలో తన జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న వాటర్‌ ప్లాంట్‌కు కూడా ఆటంకం కల్పించాడని, గతంలో ఇరువురు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో సమ్మయ్య వల్ల తనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అడ్డుతొలగించుకుంటే తప్పా తనకు ప్రశాంతత లేదని భావించిన శంకరయ్య.. సమ్మయ్య హత్యకు పథకం రచించాడు. ఇందులో భాగంగా 2021 జూలై 10వ తేదీన సమ్మయ్య తన మనవడు సుప్రీత్‌, గ్రామస్తుడు వీరారెడ్డితో కలిసి వాకింగ్‌ కోసం మైసమ్మ కుంట వద్దకు వెళ్లాడు. అక్కడ యోగా చేస్తుండగా సమ్మయ్యను శంకరయ్య గొడ్డలితో నరికి చంపి పరారయ్యాడు. వీరారెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబీకులు హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లిచూడగా సమ్మయ్య మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు మడికొండ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు దాడబోయిన శంకరయ్యకు జీవిత ఖైదు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి ఎం.కృష్ణమూర్తి తీర్పు వెల్లడించారు. కేసు సీఐ రవికుమార్‌, ఎస్సై ప్రతాప్‌ పరిశోధించగా, ఏఎస్సై కె.పరమేశ్వరి, కానిస్టేబుల్‌ వి.రాజేష్‌ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

పీపీకి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు..

ఈ కేసులో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ మోకాళ్ల సత్యనారాయణగౌడ్‌కు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సాక్షులకు మనోధైర్యం కల్పించి వారిని కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా వాదించిన సత్యనారాయణగౌడ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. వీరితో పాటు కేసు విషయంలో బాధ్యత వహించిన పోలీస్‌ అధికారులకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

ఈ సీజన్‌లో అత్యధిక మిర్చి

- ఏనుమాముల మార్కెట్‌కు 1.30 లక్షల బస్తాలు
- బంద్‌ల ఎఫెక్ట్‌ కారణం..
- కోల్డ్‌ స్టోరేజీల్లో స్థలం లేక రైతుల ఇబ్బందులు
- ఎండలతో తూకాలు ఆలస్యం


వరంగల్‌ మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

వరంగల్‌ : వరంగల్‌ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లోనే అత్యధికంగా లక్షా 30 వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. ఈ నెలలో రంజాన్‌, ఉగాది పండుగలు రావడంతో గడిచిన 15 రోజుల్లో కేవలం 6 రోజులు మాత్రమే క్రయవిక్రయాలు జరిగాయి. దీంతో సోమవారం భారీగా మిర్చిని రైతులు మార్కెట్‌లో అమ్మేందుకు వచ్చారు. రెండో కోత పూర్తి కావడంతో రైతులు పూర్తిస్థాయిలో సరుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. పెద్ద ఎత్తున మిర్చి రావడంతో ధరలు పడిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌ పరిధిలోని కోల్డ్‌ స్టోరేజీలు అన్ని నిండుకోవడంతో తక్కువ ధరలకు అమ్మని రైతులకు ఛాన్స్‌ లేకుండాపోయింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు ఏదో ఒక ధరలకు విక్రయిస్తూ ఇంటిబాట పట్టారు. ఎక్కువ బస్తాలతో పాటు అర్థికంగా ఉన్న రైతులు ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఉన్న కోల్డ్‌ స్టోరేజీలకు సరుకులను తరలిస్తున్నారు. తేజ రకం మిర్చి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.18,300, కనిష్టంగా రూ.14,500, యూఎస్‌–341 రకం గరిష్టంగా రూ.15,500, కనిష్టంగా రూ.10,500 పలికింది. అదే విధంగా వండర్‌హాట్‌ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.15వేలు, కనిష్టంగా రూ.11వేలు పలికింది. విపరీతమైన ఎండలతో ఉష్ణోగ్రతలు పెరగడం, భారీగా బస్తాలు రావడంతో మార్కెట్‌ యార్డుల్లోని కార్మికులు, దడవాయి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమి వల్ల కాంటాలు వేయడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. యార్డుల వద్ద తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎండ వేడిమి తాళలేక చెట్ల కింద సేదతీరారు. సోమవారం రాత్రి వరకు సుమారు 60–70 వేల బస్తాల వరకే కాంటాలు జరుగుతాయని, మిగతా వాటికి మంగళవారం పెడతామని మార్కెట్‌ సిబ్బంది తెలిపింది. మంగళవారం సైతం పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆటాపాట

స్టెప్పులేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి భర్త

- వీడియో తీసి ఎంజాయ్‌ చేసిన పోలీసులు
- ఎస్పీ కిరణ్‌ ఖరే కన్నెర్ర.. హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్‌ వేటు
- ఎస్సై, ఒక హెడ్‌ కానిస్టేబుల్‌, ఆరుగురు కానిస్టేబుళ్ల బదిలీ


పీఎస్‌లో స్టెప్పులేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు భర్త శ్రీనివాస్‌

భూపాలపల్లి: 'వేసవి కాలం వెన్నెల్లాగా... ఓరోరి అందగాడా.. నీ కోసం నీ కోసం..' అంటూ సినిమా పాటకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే స్టెప్పులేశాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ కావడం.. విషయం తెలిసిన పోలీస్‌ ఉన్నతాధికారులు ఏకంగా ఎస్సైతోపాటు ఎనిమిది మంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. సంచలనంగా మారిన ఈ ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్‌ ఠాణాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అధికార కాంగ్రెస్‌ పార్టీకి చెందిన మహదేవ్‌పూర్‌ జెడ్పీటీసీ సభ్యురాలు గుడాల అరుణ భర్త శ్రీనివాస్‌ సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లాడు. అక్కడ సిబ్బందితో ముచ్చటించిన అనంతరం వారు సౌండ్‌ బాక్స్‌ ఏర్పాటు చేయగా సినిమా పాటకు డ్యాన్స్‌ చేశారు. అతను స్టెప్పులు వేస్తున్న సమయంలో.. అబ్బ ఏం చేస్తున్నాడన్నా.. భలే చేస్తున్నావన్నా.. అంటూ పోలీస్‌ సిబ్బంది పొగుడుతూ మొత్తం వీడియో తీశారు. శ్రీనివాస్‌ కొద్దిసేపటి అనంతరం సోషల్‌ మీడియాలో ఓ పోస్టును విడుదల చేశారు. తాను సామాజిక స్పృహ ఉన్న వ్యక్తినని, పోలీసులు నిరంతరం పని చేస్తున్నందున, ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురి కాకుండా ఉండాలనేది తన ఉద్దేశమన్నారు. ఒత్తిడి లేకుండా ఎలా ఉండాలి అనే విషయాలు చెప్పి, ఏదో ఒక వ్యాయామం చేసి శరీరంలోని మలినాలను తొలగించుకునేలా చూడాలని పోలీసు సిబ్బందికి చెప్పినట్లు వెల్లడించారు. దీంతోపాటు స్టేషన్‌లో వేసిన డాన్స్‌ వీడియోను కూడా పోస్ట్‌ చేశారు.

ఎస్పీ కిరణ్‌ ఖరే సీరియస్‌..

మహదేవ్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకున్న సంఘటనపై ఎస్పీ కిరణ్‌ ఖరే సీరియస్‌ అయ్యారు. ప్రజాప్రతినిధి భర్త శ్రీనివాస్‌ డ్యాన్స్‌ చేసిన సంఘటనే కాకుండా స్థానిక పోలీస్‌ సిబ్బందిపై కొద్ది రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. నిఘా విభాగానికి చెందిన ఓ కానిస్టేబుల్‌ బహిరంగ ప్రదేశంలో కల్లు తాగిన వీడియో ఆదివారం వైరల్‌ అయింది. అంతేకాక పలు దందాల్లో సిబ్బంది చేతివాటం ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు విచారణ చేపట్టిన ఎస్పీ జిల్లాలో ఎన్నడూ లేని రీతిలో స్టేషన్‌లో పనిచేసే 9 మందిపై చర్యలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధి భర్త పోలీస్‌స్టేషన్‌లో డ్యాన్స్‌ వేసిన చర్యకుగాను ఎస్‌హెచ్‌ఓ ప్రసాద్‌ను వీఆర్‌ (వేకెన్సీ రిజర్వ్‌)కు బదిలీ చేయగా, హెడ్‌ కానిస్టేబుల్‌ సోయం శ్రీనివాస్‌ ను సస్పెండ్‌ చేశారు. అలాగే, ఆ కారణంతో పాటు వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న హెడ్‌కానిస్టేబుల్‌ ఉపేందర్‌, మరో ఆరుగురు కానిస్టేబుళ్లను వివిధ పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేశారు.

మావోయిస్టు సంతోష్‌కు ఘన నివాళి


సంతోష్‌కు నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

కాటారం: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌ జిల్లా పూజార్‌ కాంకేర్‌ అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అన్నె సంతోష్‌ అలియాస్‌ సాగర్‌కు సోమవారం అమరుల బంధుమిత్రుల కమిటీ ఆధ్వర్యంలో అశ్రు నివాళులర్పించారు. కాటారం మండలం అంకుషాపూర్‌ గ్రామ పంచాయతీ పరిధి దస్తగిరిపల్లిలోని తన నివాసంలో సంతోష్‌ స్మారక స్తూపం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్‌ విప్లవ జీవితంపై పాటలు పాడారు. కార్యక్రమంలో బంధుమిత్రుల కమిటీ అధ్యక్షురాలు అంజమ్మ, ప్రధాన కార్యదర్శి పద్మకుమారి, ట్రెజరర్‌ శాంత, పౌరహక్కుల సంఘం నాయకులు లక్ష్మణ్‌నారాయణ, విరసం నేత రాజన్న, తదితరులు పాల్గొన్నారు.